ప్రజాశక్తి
సోమవారం 3 ఫిబ్రవరి 2025 5
శ్రీ సత్యసాయి





కర్మాగారం ఏర్పాటుకు చేపట్టిన నిర్మాణాలు

జనంపై అదానీ 'పేలుడు'

మండల పరిధిలోని పెద్దకోట్ల చిలకొండయ్యపల్లి గ్రామ సరిహద్దుల్లో అదానీకంపెనీ వారు నిర్మిస్తున్న విద్యుత్ కర్మాగారం వల్ల పెద్దకోట్ల, దాడి తోట, చిలకొండపల్లి గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అక్కడను పేలుస్తున్న పేలుడు ధ్వని వల్ల ఏ సమయంలో ఎలాంటి ఉపద్రవం సంభవిస్తుందోనని ఆందోళనకు గురి అవుతున్నారు, రాత్రి సమయాల్లో పని చేస్తున్న భారీ యంత్రాల శబ్దానికి ప్రజలకు నిద్ర లేకుండా పోతోందని మూడు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామాలకు ఎటువంటి హాని లేని పనులు చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ప్రజాశక్తి తాడిమర్రి

ఉచిత కంటివైద్య శిబిరం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పేద ప్రజలందరికీ కంటి వెలుగును ప్రసాదించడమే తమ లక్ష్యమని యూవర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు షీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం ,కోశాధికారి వంకదారి మోహన్, క్యాంపు చైర్మన్ పోలా ప్రభాకర్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఉచిత ఐఓఎల్ కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కంటి వైద్య శిబిరం యువర్స్ ఫౌండేషన్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ –శ్రీ సత్య సాయి జిల్లా, నేత్ర జ్యోతి కంటి ఆసుపత్రి–బెంగళూరు (బెంగళూరు వెస్ట్ లయన్స్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి) సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో 96 మంది కంటి రోగులకు పరీక్షలు చేసిన బెంగళూరు ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అంజనా, డాక్టర్ అయాసే 46 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. ఈ శిబిరానికి దాతలుగా కీర్తిశేషులు కాచర్ల హనుమంతు జ్ఞాపకార్థం కుమారుడు కాచర్ల నాగరాజు వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో నామాల శ్రీనివాసులు, పెనుజూరి నాగరాజు, నాగార్జున చాంద్ బాషా, సత్రశాల మల్లికార్జున, గర్రె రమేష్ బాబు, ఓ వి. ప్రసాద్, సికిందర్, సుంకుసుకుమార్, సి కె. రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



బాలయ్యకు జ్ఞాపికను అందిస్తున్న దృశ్యం

'బాలయ్య'కు స్వాగతం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ పట్టణానికి ఆదివారం వచ్చారు. ఈ నేపథ్యంలో బాలకృష్ణకు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే పలువురు నాయకులతో సోమవారం మున్సిపల్ చైర్మన్ ఎన్నికపై చర్చించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పేరుతో బంగారాన్ని పండించే పంట పొలాలను భూసేకరణతో రైతుల నుంచి లాక్కొని బడా పారిశ్రామిక వేత్తలకు కట్టబెట్టారు. ఇలా తీసుకున్న భూముల్లో హిందూపురం రూరల్ మండలం తుమకుంట, గోళ్లపురం ప్రాంతాల్లో రసాయనిక పరిశ్రమలను ఏర్పాటు చేశారు. ఈ పరిశ్రమల నుంచి వెలువడే రసాయన వ్యర్థాలు ఆ ప్రాంతాన్ని కాలుష్యం కాటుకు గురి చేస్తున్నాయి. రసాయన వ్యర్థాలను పారిశ్రామిక వాడలోనే గుంతలు తీసి పడేస్తున్నారు. ఈ వ్యర్థాలు భూమిలో కలిసి జలకాలుష్యం అవుతోంది. బయట వాయు కాలుష్యం చేస్తున్నాయి. దీంతో పాటు పరిశ్రమలు చిమ్మే విషవాయువును పీల్చి ప్రజలు రోగాల భారీన పడుతున్నారు. సాగుతో కళకళలాడే సమీప పంట పొలాలు బీళ్లుగా మారుతున్నాయి.



భూమిలో చిన్నపాటి గుంత తీసి వేసిన రసాయన వ్యర్థాలు



పారిశ్రామిక వాడ సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన భూమిపై రసాయన వ్యర్థాలతో ఏర్పడిన కాలుష్యం

కాలుష్యం కాటు..!

- భూమిలోకి రసాయన పరిశ్రమల వ్యర్థాలు
- కాలుష్య కోరల్లో పారిశ్రామిక వాడ, సమీప గ్రామాలు
- విషవాయువులతో పంట కాలుష్యం, రోగాల భారిన ప్రజలు
- ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోని కాలుష్య నియంత్రణ శాఖ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం తుమకుంట, గోళ్లపురం పారిశ్రామిక వాడతోపాటు చుట్టుపక్కల ఉన్న గ్రామాలు కాలుష్యం కోరల్లో కూరుకుపోయాయి. కెమికల్ పరిశ్రమలు, స్టీల్ పరిశ్రమలు వెదజల్లే పొగ, దుర్వాసనకు పారిశ్రామిక వాడ పరిధిలోని గోళాపురం, గుడ్డంపల్లి, దేవరపల్లి తదితర గ్రామ ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. పరిశ్రమల నుంచి వచ్చే పొగలు మేఘాలను తలపిస్తుంటాయి. దట్టమైన పొగ వ్యాపించడంతో ఈ ప్రాంతంలో వాహనాలు నడపడానికి సైతం రోడ్డు కనబడక వాహనదారులు ఇబ్బంది పడే పరిస్థితి ఉంటుంది. పారిశ్రామిక వాడ సమీపంలో నివసించే గ్రామాల ప్రజలు శ్వాశకోశ, చర్మవ్యాధులతో అల్లాడిపోతున్నారు. రసాయన పరిశ్రమల వ్యర్థాలను భూముల్లోకి యథేచ్ఛగా వదిలేస్తున్నారు. ఇవి భూమిలో ఇంకి భూ గర్భజలాలు కలుషితం అవుతున్నాయి. రసాయనాల ప్రభావంతో ఈ ప్రాంతంలో నివసించే వృద్ధులు, చిన్న పిల్లలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. గతంలో మంచి పంటలు పండే భూములు కూడా ప్రస్తుతం నిస్సారం అయ్యి బీడుగా మారాయి. పరిశ్రమల సమీప ప్రాంతాల్లో కేవలం మొక్కజొన్న పంటను మాత్రమే సాగుచేసుకునే పరస్థితి ఉంది. ఈ ప్రాంతానికి అతిపెద్ద ఆధారంగా నిలిచిన పట్టుపరిశ్రమ కాలుష్యం దెబ్బతో చితికిపోయింది. ఇటు పరిశ్రమల్లో ఉపాధి లభించక అటు వ్యవసాయ భూములు లేక ఈ ప్రాంతవాసులు అన్ని విధాలా నష్టపోయారు. పరిశ్రమలను నుంచి వచ్చే వ్యర్థాలను బయటకు తరలించకుండా పారిశ్రామిక వాడలోనే గుంతలు తీసి అందులో పడేస్తున్నారు. దీంతో పాటు రైల్వే ట్రాక్ పక్కన సైతం వేస్తున్నారు. ఈ వ్యర్థాల వేడి వల్ల భూమి కంపించి రైల్వే ట్రాక్ ఏ క్షణంలో నైనా ట్రాక్ పక్కకు వాలే అవకాశాలు ఉన్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఇటీవల వ్యర్థాలు పడేసిన ప్రాంతాన్ని పరిశీలన చేస్తున్న కాలుష్య మండలి అధికారులు (ఫైల్ ఫొటో)

భూమిపైనే రసయాన వ్యర్థలు

తూమకుంట, గోళ్లపురం పారిశ్రామిక వాడలో ఏర్పాటు చేసినా ఉక్కు, రసాయన పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను చుట్టు పక్కల పారేస్తున్నారు. పారిశ్రామిక వాడలో 8 రసాయన, 22 వరకు స్టీల్ పరిశ్రమలున్నాయి. వీటి నుంచి వచ్చే వ్యర్థాలు భూమిలోపల సుమారు 50 అడుగుల లోపలకు వేసి పూడ్చాలి. పరిశ్రమ యాజమాన్యాలు ఇలా చేయడం లేదు. ప్రజాప్రతినిధులే ఏజెంట్లుగా మారి పరిశ్రమల నుంచి వచ్చిన వ్యర్థాన్ని ప్రత్యేక ట్యాంకర్లు ఏర్పాటు చేసి జన నివాసం లేని ప్రాంతాల్లో ఆరుబయటనే వేస్తున్నారు. ఇలా రసాయనం వేసిన ప్రాంతంలో ఒక పిచ్చిమొక్క కుడా మొలవని పరిస్థితి ఏర్పడుతోంది. కొన్ని పరిశ్రమలు ఏకంగా రసాయన వ్యర్థాలను చిన్న కాలువలు చేసి మురుగు నీటి కాలువలోకి వదిలేస్తున్నారు. దీనిని అధికారులెవరూ ప్రశ్నించకపోవడంతో పరిశ్రమల యజమానులు యథేచ్ఛగా జనావాసంలోకి రసాయనాలను వదిలేస్తున్నారు.

చర్యలు శూన్యం

తూమకుంట, గోళ్లపురం పారిశ్రామిక వాడ పరిశ్రమల వల్ల పర్యావరణం దెబ్బ తిని కాలుష్యం ఏర్పడింది. పారిశ్రామిక వాడ చుట్టుపక్కల ఉన్న గ్రామలు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. వ్యర్థాలను ట్యాంకర్ల ద్వారా తీసుకొచ్చి భూమిపై చిన్నపాటి గుంతతీసి అందులో వేస్తున్నారు. ఇది ప్రజలకు అత్యంత ప్రమాదామని, దీనిని నియంత్రించాలని కాలుష్య నియంత్రణ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా వారి నుంచి స్పందన లేదు. పరిశీలనతోనే అధికారులు కాలం గడిపేస్తున్నారు. అధికారులు చర్యలకు ఉపక్రమించకుంటే పారిశ్రామిక వాడ సమీప గ్రామీణుల కోసం ప్రత్యక్ష ఆందోళనలు చేపడతాం.

రవికుమార్,
అధ్యక్షులు తూమకుంట పారిశ్రామిక వాడ.

విప్ ప్రొసీడింగ్స్‌లో అధికారుల నిర్లక్ష్యం

ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తాం : వైసిపి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ చైర్మన్ ఎన్నికను అటు అధికార టిడిపి, ఇటు వైసిపి ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో రసవత్తరంగా మారింది. హిందూపురం మున్సిపాలిటీలో మొత్తం 38 వార్డులు ఉండగా గత మున్సిపల్ ఎన్నికల సందర్భంగా 30 మంది వైసిపి కౌన్సిలర్లు విజయం సాధించారు. అప్పట్లో మున్సిపల్ చైర్ పర్సన్ గా ఇంద్రజ ఎన్నికైంది. అయితే రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అధికార మార్పిడి జరగడంతో మున్సిపాలిటీలో కూడా పార్టీ ఫిరాయింపులు చోటుచేసుకున్నాయి. ఏకంగా మున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజతోపాటు పదిమంది వైసిపి కౌన్సిలర్లు ఎమ్మెల్యే బాలకృష్ణ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఇంద్రజ టిడిపిలోకి చేరడంతో పాటు మున్సిపల్ చైర్ పర్సన్ పదవికి రాజీనామా చేసింది. దీంతో నూతన చైర్మన్ ను ఎన్నుకునేందుకు ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం తెలుగుదేశం పార్టీకి సంఖ్యాబలం 21 ఉండగా వైసిపి నుండి 17 సంఖ్యాబలం ఉంది. దీంతో రెండు పార్టీలు చైర్మన్ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఎలాగైనా పాగా వేయాలని తెలుగుదేశం పార్టీ భావిస్తుండగా తెలుగుదేశం ఎత్తులను చిత్తు చేయాలని వైసిపి పావులు కదుపుతోంది. ఇందులో భాగంగా వైసిపి నుండి టిడిపిలోకి చేరిన వైసిపికౌన్సిలర్ల ఓటు తెలుగుదేశం పార్టీకి వేసిన చెల్లకుండా వైసిపి అధిష్టానం విప్ జారీ చేసింది. ఇదే విషయాన్ని తెలియజేసేందుకు డెలిగేట్ మున్సిపల్ చైర్మన్ బలరామిరెడ్డి ఆధ్వర్యంలో వైసిపి లీగల్ సెల్ ప్రతినిధి వెంకటరెడ్డి, పార్టీ కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులును కలిసేందుకు ఆదివారం వెళ్లారు. అయితే కమిషనర్ తనకు విప్ ప్రొసీడింగ్స్ తీసుకుని అధికారం లేదని, ఎనికల అధికారికి అందజేయాలని సూచించారు. మధ్యాహ్నం వరకు వైసిపి నాయకులు మున్సిపల్ కార్యాలయంలోని వేచి ఉన్నారు. అయితే మధ్యాహ్నం 2 గంటలకు మున్సిపల్ కార్యాలయం చేరుకున్న ఎన్నికల అధికారి, పెనుకొండ ఆర్డీవో ఆనంద్ కుమార్ కు విప్ ప్రొసీడింగ్స్ అందజేసేందుకు వైసిపి బృందం ప్రయత్నించింది. అయితే ఆర్డీవో ప్రస్తుతం సమయం మించిపోయిందని , ప్రస్తుతం తాను విప్ ప్రొసీడింగ్స్ తీసుకోలేనని పేర్కొన్నారు. దీంతో అధికారుల తీరు పట్ల వైసిపి నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీ కనుసన్నల్లో అధికారులు పనిచేస్తున్నారని ఆరోపించారు. చివరకు సాయంత్రం ఎన్నికల అధికారి విప్ ప్రొసీడింగ్‌ను ి అందుకున్నారు. అందుకు సంబంధించి ఎండార్స్ మెంట్ ఇవ్వలేదని డెలిగేట్ చైర్మన్ బలరామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు మాట్లాడుతూ చైర్మన్ ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతో టిడిపి నాయకులు అధికారులను ప్రలోభాలకు గురిచేస్తూ ఏకపక్షంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రయత్నాల సాగిస్తున్నారని ఆరోపించారు. అధికారుల తీరుపై ఇదే విషయాన్ని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ప్రొసీడింగ్స్ తీసుకుని, ఎండార్స్‌మెంట్ ఇవ్వని ఎన్నికల అధికారి పై చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు తెలిపారు.

'పురం' చైర్మన్ ఎన్నికకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘ చైర్మన్ ఎన్నికకు సంబంధించి ఏర్పాట్లను ప్రొసీడింగ్ అధికారి, పెనుగొండ ఆర్డీవో ఆనంద్ కుమార్ తో కలిసి డిఆర్ఓ విజయసారథి ఆదివారం పరిశీలించారు. సభకు హాజరవుతున్న ఎంపీ, ఎమ్మెల్యేలకు సీట్ల కేటాయింపు తదితర అంశాలను కౌన్సిల్ హాల్‌లో పరిశీలించారు. అదేవిధంగా పోలీసు అధికారులతో తగిన బందోబస్తు గురించి అడిగి తెలుసుకున్నారు. సోమవారం జరిగే చైర్మన్ ఎన్నిక ప్రశాంతంగా జరిగే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు, మున్సిపల్ ఇంజనీర్ మోహన్ పాల్గొన్నారు.

ఎస్పీ పరిశీలన : సోమవారం హిందూపురం పురపాలక సంఘ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో ఎస్పీ రత్న డిఎస్‌పి మహేష్ తో కలిసి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాట్లను పరిశీలించారు. అనుమతులు లేని వాహనాలను, వ్యక్తులను అనుమతించరాదని సూచించారు. ఎన్నిక జరిగే వరకు, ఎన్నిక అనంతరం పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

సమాజ మార్పునకు సహకారం

- ఫెర్రర్ స్ఫూర్తితో ముందడుగు
- ఎఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ డా॥వైవి.మల్లారెడ్డి
- 'ప్రజాశక్తి'తో స్వచ్ఛంద సేవారంగంలో 50 ఏళ్లు అనుభవాలు



వైవి.మల్లారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'యాభై ఏళ్లగా స్వచ్ఛంద సేవా రంగంలో ఉంటూ సమాజ మార్పులో నా వంతు కృషి చేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది' అని ఎఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ డాక్టర్ వైవి.మల్లారెడ్డి పేర్కొన్నారు. నిత్యం కరువులకు నిలయమైన అనంతపురం జిల్లాలో కరువు కాటకాలు, దారిద్ర్యం నుంచి ప్రజలను కాపాడే విషయంలో ప్రభుత్వాలతోపాటు స్వచ్ఛంద సంస్థల కృషి ఉంది. ఈ కృషిలో సుదీర్ఘకాలం పనిచేసిన వ్యక్తుల్లో డాక్టర్ వైవి.మల్లారెడ్డి ఒకరు. ఆయన ఈ రంగంలో పనిచేస్తూ 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన అనుభవాలను 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలియజేశారు.

ప్ర : సుదీర్ఘ జీవన ప్రయాణంలో మీరు గమనించిన గ్రామీణ ప్రజాజీవనం మార్పు ఏ రకంగా ఉంది ?

వైవి : 1970 దశకంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో కటిక దారిద్ర్యం తాండవిస్తూ ఉండేది. తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్ట కూడా కష్టమైన రోజులు ఆనాడు ఉండేవి. ప్రజల్లో చైతన్యం చాలా తక్కువగా ఉండేది. ప్రధానంగా దళిత, గిరిజనుల పరిస్థితి మరింత దయనీయంగా ఉండేది. నిరక్షరాస్యత అధికం. ఆనాటి పరిస్థితుల నుంచి ఇప్పటికి చూస్తే పెద్ద మార్పే సమాజంలో జరిగిందని చెప్పవచ్చు. ఇందులో ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థల కృషి ఎంతగానో ఉంది. అక్షరాస్యత అందరిలోనూ ఇప్పుడు పెరిగింది. తద్వార ప్రజల్లో చైత్యం పెరిగింది.



ప్ర : గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు పెరిగినా రైతు ఆత్మహత్యలు కొనసాగుతూ ఉండటానికి గల కారణాలు ఏమిటి.?

వైవి : వ్యవసాయంలో వచ్చిన మార్పులే రైతు ఆత్మహత్యలకు కారణమని చెప్పవచ్చు. 1975 ముందు వరకు జిల్లాలో వ్యవసాయం ఆహర ఉత్పత్తి ఆధారంగా ఉంటూ వచ్చింది. వేరుశనగ సాగు 1980లో ప్రారంభమైంది. అప్పటి నుంచి వ్యవసాయ విధానంలోనూ మార్పులు చోటు చేసుకుంటూ వచ్చాయి. ఆహార ధాన్యల ఉత్పత్తి కాకుండా వాణిజ్యపంటల వైపు మొగ్గుచూపడం, ప్రభుత్వాలూ అటువైపు ప్రోత్సహిస్తూ వచ్చాయి. ఇది ఎప్పుడు పెరిగిందో అప్పుడు రైతుపై ఆర్థికపరమైన భారం పడుతూ వచ్చింది. ఇదే సమయంలో వర్షాభావ పరిస్థితులు, గిట్టుబాటు ధర లేకపోవడం వంటి వాటితో రైతులు రుణాల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యల వైపునకు దారితీసింది. రుణభారాల్లో అత్యధికంగా వ్యవసాయ బోర్లు కూడా ఉన్నాయి. సాగునీటి కోసం బోర్లపైన బోర్లు వేసి రుణభారాల్లో కూరుకు పోవడం ఆత్మహత్యల ఓకారణం అయ్యింది.

ప్ర : ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు తీసుకోవడం ద్వారా రైతు ఆత్మహత్యలను నివారించవచ్చు ?

వైవి : రైతు ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యల్లో ప్రధానమైనది గిట్టుబాటు ధర కల్పించాలి. పంటలబీమా విధానంలో రైతుకు మరింత ప్రయోజనం చేకూరే విధానాన్ని తీసుకురావాలి. ఇప్పుడున్న పంటల సాగు విధానం కాకుండా ప్రకృతి ఆధారంగా పంటలసాగును ప్రోత్సహించాలి. వారిపై పడుతున్న ఆర్థికభారాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలి. మెట్ట వ్యవసాయాభివృద్ధికి కృషి చేయాల్సి ఉంది.

ప్ర : మీ యాభై ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో జిల్లా అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల పాత్ర ఏ మేరకుంది ?

వైవి : జిల్లా అభివృద్ధిలో ప్రభుత్వాల పాత్రనే ఎక్కువగా ఉంటుంది. అందులో కొంత తోడ్పాటు, సహకారం స్వచ్ఛంద సంస్థలదీ ఉంటుంది. ఈ జిల్లాలో స్వచ్ఛంద సంస్థలది గణనీయమైన పాత్ర ఉందని చెప్పవచ్చు. అక్షరాస్యత పెంపొందించడం, నీటి సంరక్షణ పనులు చేపట్టడం, హెల్త్ ఎడ్యుకేషన్ సామాన్యుల వరకు చేర్చడం, పర్యావరణ పరిరక్షణలో జిల్లాలో ఎన్జీవోల పాత్ర చెప్పోకోదగిన విధంగా ఉంది.

ప్ర : మీకు సంతృప్తిని కలిగించిన అంశాలేమిటీ ?

వైవి : ప్రజల్లో చైనత్య కల్పించే విషయంలో బాగా కృషి చేశాం. ప్రధానంగా అనంతపురం జిల్లా పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ జిల్లాకు వాల్టా చట్టం తీసుకురావడంలో నా వంతు ప్రయత్నం చేయగలిగాను. స్వచ్ఛంద సంస్థల ద్వారా సేవలందించడమే కాకుండా తనకున్న సంబంధాల పరిధిలోనూ ప్రజలకు మేలు జరిగే కార్యక్రమాలను ప్రభుత్వపరంగా తీసుకురాగలిగాం. నీటి సంరక్షణ పనులు సుమారు వంద గ్రామాల్లో చేపట్టగలిగాం. వాటి ప్రయోజనాలు గ్రామీణ ప్రజానీకానికి అందుతున్నప్పుడు సంతోషం కలుగుతుంది. పది వేల మంది మహిళలకు జీవనోపాధులు కల్పించగలిగాం. మహిళలు ఆత్మస్థైర్యంగా బతికేందుకు అవసరమైన వాతావరణాన్ని కల్పించడంలో సఫలీకృతమయ్యాం.

ప్ర : ఇంకా చేయాలనుకున్న అంశాలేమిటి.?

వైవి : ఇంకాచేయాల్సింది చాలానే ఉంది. వినిమయ సంస్కృతిపై ఇప్పుడు ప్రధానంగా దృష్టి సారించాలి అనుకుంటున్నాం. వస్తు వ్యామోహం ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగింది. ఇది విపరీత ధోరణలకు దారితీస్తోంది. మానవ సంబంధాలను దెబ్బతీస్తున్నాయి. అందుకే ఈ రంగంలో రాబోయే రోజుల్లో పనిచేయాలని భావిస్తున్నాం. అమతత్వం అన్న పేరుతో ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని భావిస్తున్నా

గంజాయి రహిత అనంతగా మారుద్దాం

- శాప్ చైర్మన్ రవి నాయుడు, ఎమ్మెల్యే దగ్గుపాటి, టిసి.వరుణ్
- ఉత్సాహంగా అనంతలో 'వి రన్ ఫర్ అనంతపురం'
- పాల్గొన్న యువత, విద్యార్థులు



వి రన్ ఫర్ అనంతలో పాల్గొన్న ఎమ్మెల్యే, శాప్ చైర్మన్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతను గంజాయి, డ్రగ్స్ రహిత జిల్లాగా మారుద్దామని శాప్ చైర్మన్ రవి నాయుడు, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, అహుడా చైర్మన్ టిసి.వరుణ్‌లు పిలుపునిచ్చారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్), యాంటీ నార్కోటిక్స్ పోలీస్ విభాగం "ఈగల్", అహుడా, వి వైబ్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 'వి రన్ ఫర్ అనంతపురం' కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట నుంచి 10కె, 5కె, 3కె రన్‌లు ప్రారంభం అయ్యాయి. యువత, విద్యార్థులు, క్రీడాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మూడు విభాగాల్లో జరిగిన ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథులు శాప్ చైర్మన్ రవి నాయుడు, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, అహుడా చైర్మన్ వరుణ్, నిర్వాహకురాలు సజ్జ రాగవీణ, అడిషనల్ ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ డ్రగ్స్ గంజాయి రహిత రాష్ట్రంగా కూటమి ప్రభుత్వం తీర్చిదిద్దుతోందన్నారు. గత ప్రభుత్వంలో విచ్చలవిడి తనంతో డ్రగ్స్ ప్రభావం ప్రజలపై పడిందన్నారు. శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ అందరి సహకారంతో అనంతపురంలో డ్రగ్స్ మహమ్మారి నివారణ సాధ్యం అవుతుందన్నారు. యువత దీనిపై పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అనంతపురం జిల్లాను క్రీడా హబ్‌గా మారుస్తామని తెలిపారు. గంజాయి కట్టడికి అనంతపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ కృషి చేస్తుందని అహుడా చైర్మన్ టిసి. వరుణ్ తెలిపారు. అనంతరం రన్ కార్యక్రమంలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కాలేజీ ఎన్ఎస్ఎస్ అధికారి డా॥కరణం సుధాకర్, ఎస్‌వియు ఎన్ఎస్ఎస్, మీడియా కోఆర్డినేటర్ డా॥పాకనాటి హరికృష్ణ, జిల్లా క్రీడ అధికారి ఉదయ్ భాస్కర్, డా॥మహేంద్ర చౌదరి, హైదరాబాద్ చెఫ్స్ అదినేత సందీప్ చౌదరి, అర్బన్ టెక్ తేజా రెడ్డి, తెలుగు యువత తానికొండ రంజిత్, బాల లోకేష్ యాదవ్, టిఎన్ఎస్ఎఫ్ బాలరాజు, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, పద్మశాలి ఫెడరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు, రజక ఫెడరేషన్ డైరెక్టర్ పరమేశ్వర్, రాయలసీమ బలిజ సంఘం జిల్లా యువజన అధ్యక్షుడు తొండపునాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోయిన మురుగు

పట్టించుకోని అధికారులు ఇబ్బందుల్లో ప్రజలు



ఎనుములపల్లిలో రోడ్డుపై నిలిచిన మురుగునీరు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి ఎంతోమంది విదేశీయులతో కిటకిటలాడే ప్రాంతం. జిల్లా కేంద్రమైన పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో డ్రయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. సంవత్సరాలు గడుస్తున్నా దాని గురించి పట్టించుకున్న నాథుడే లేడు. పారిశుధ్యం లోపించడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపైనే మురుగునీరు ప్రవహిస్తుండడంతో దుర్గంధం భరించలేకపోతున్నారు. ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి, నాయకులు మారుతున్నారు, మున్సిపల్ కమిషనర్లు మారుతున్నారు. కానీ సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. ఈ సమస్యను పరిష్కరించడం మాని వారు స్థానికులకు మరో సమస్య తెచ్చిపెట్టారు. ఈ సమస్యలు ఏంటో తెలియాలంటే ఆ గ్రామానికి వెళ్లాల్సిందే...

తాండవిస్తున్న అపరిశుభ్రత

శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి మున్సిపల్ పరిధిలో పరిశుభ్రత... పైన పటారం లోన లొటారంగా తయారయ్యింది. పుట్టపర్తిలో ప్రధాన రోడ్డు బాగున్నప్పటికీ మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి 12, 13, 14 వార్డుల్లో గత పది సంవత్సరాలుగా నిత్యం మురుగునీరు వీధుల్లో పారుతోంది. అయినా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. ఒక వర్షాకాలమే కాదు ఏడాది పొడుగునా ఈ గ్రామంలో రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తూనే ఉంటుంది. నిత్యం రోడ్లపై నీరు పారుతుండడంతో పాచి పట్టి పోయాయి. అడుగు తీసి అడుగు పెట్టాలంటే ఎక్కడ జారి కింద పడతామో అని ఆందోళన చెందుతున్నారు. డ్రైనేజీ సమస్యతో బాధపడుతున్న ఆ గ్రామస్తులకు, అధికారులు మరో సమస్య తెచ్చిపెట్టారు. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి ప్రతి వీధికి సిమెంటు రోడ్లు వేసింది. తర్వాత 2019లో వచ్చిన వైయస్సార్ ప్రభుత్వంలో కేంద్ర ప్రభుత్వం పథకం ద్వారా ప్రతి ఇంటికి తాగునీటిని అందించాలని అమృత్ పథకాన్ని ప్రవేశపెట్టింది. దీనికోసం పైప్ లైన్ వేయడానికి ప్రతి వీధిలోను ఉన్న సిమెంటు రోడ్లను పగలగొట్టి గోతులమయం చేశారు. ఇప్పుడు ఎనుములపల్లి గ్రామంలో ఎక్కడ చూసినా రోడ్లన్నీ గోతులమయం అవడంతో మురుగు నీరు అందులో చేరి దోమలు ఉత్పత్తి అవుతున్నాయి. ఆ గోతుల్లో వృద్ధులు, వికలాంగులు, చిన్నారులు పడి కాళ్లు చేతులు విరిగొట్టుకుంటున్నారు. తాగునీరు ఇస్తామని చెప్పి రోడ్లు పగలగొట్టి తమకు లేని సమస్య తెచ్చి పెట్టారని గ్రామస్తులు వాపోతున్నారు. సంవత్సరాలు గడుస్తున్న డ్రైనేజీ సమస్య తీరకపోగా, కొత్త సమస్యను తెచ్చి పెట్టారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో చిన్నపిల్లలు చదివే అంగన్వాడి కేంద్రం చుట్టూ డ్రైనేజీ పొంగిపొర్లుతుండడంతో చిన్నారులు అందులో పడి గాయాల పాలవుతున్నట్లు స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలకు, దేవాలయాలకు వెళ్లాలంటే ఇదే ప్రధాన రహదారి కావడంతో తీవ్ర అవస్థలు పడుతున్నామంటున్నారు. ఇప్పటికే సమస్యను పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారని మా మొర ఆలకించే నాథుడే లేకుండా పోయారంటూ స్థానికులు విమర్శిస్తున్నారు. డ్రయినేజీలు లేకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



గ్రామంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

బయటకు రావాలంటే భయంగా ఉంది



వృద్ధురాలినైన నేను ఈ రోడ్లలో ప్రయాణించాలంటే భయంగా ఉంది. రెండు రోజుల క్రితం ఈ రోడ్లో వస్తూ కాలు జారి కిందపడి గాయాల పాలయ్యాను. ఇలా నేనొక్కరే కాదు చాలామంది ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే, అధికారులు స్పందించి మురుగు కాలువలు ఏర్పాటు చేస్తే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

లక్ష్మమ్మ,
గ్రామస్తురాలు, ఎనుములపల్లి

ఉన్నదానికి మరో సమస్య తెచ్చిపెట్టారు



డ్రయినేజీ సమస్యను పరిష్కరించమంటే అధికారులు నాయకులు మరో సమస్యను తెచ్చిపెట్టారు. వీధుల్లో రోడ్లు ఎక్కడికక్కడ పగలగొట్టడంతో మురుగునీరు అందులో చేరుతోంది. ఆ గోతుల్లో పడి కాళ్లు చేతులు విరిగొట్టు కుంటున్నాం. మున్సిపల్ అధికారులు కూడా గ్రామంలో ఫాగింగ్ చేయక 10 సంవత్సరాలు అవుతోంది.

క్రిష్టప్ప,
గ్రామస్తుడు, ఎనుములపల్లి

సమస్యను పట్టించుకోకపోవటం సిగ్గుచేటు



సమస్యను ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్‌కు ఎన్నిసార్లు చెప్పినా స్పందించడం లేదు. ఈ సమస్యతో గ్రామస్తులు మొత్తం తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎస్సీ, బీసీ కాలనీల్లో మురుగు రోడ్లపై పారుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు అందులోనే నడుచుకుంటూ వెళుతున్నారే కానీ సమస్యను మాత్రం పరిష్కరించడం లేదు. వీరు పట్టించుకోకపోవడం సిగ్గు చేటు.

గంగాద్రి,
సిపిఎం పుట్టపర్తి మండల కార్యదర్శి

16న జాబ్‌మేళా

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

నిరుద్యోగ యువతకు వివిధ కంపెనీలలో ఉద్యోగాల కోసం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు శాసనసభ్యురాలు పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు వారు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. టిడిపి పుట్టపర్తి కార్యాలయంలో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో వివిధ కంపెనీల ప్రతినిధులు 50 వరకు పాల్గొంటారన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9676739851 లేదా 9347860852 కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - కదిరి టౌన్

కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, అదే విధంగా పార్టీ బలోపేతం ప్రతి ఒక్కరూ పనిచేయాలని జనసేన పార్టీ ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్, నాయకులు శివ శంకర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్జీవో హోంలో జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు కాయల చలపతి అధ్యక్షతన కదిరి పట్టణ కమిటీ సభ్యులతో ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన శివ శంకర్, భైరవ ప్రసాద్ మాట్లాడుతూ పార్టీ నాయకులు , కార్యకర్తలు పట్టణంలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు , మునిసిపల్ ఎన్నికలకు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ,పట్టణ ఉపాధ్యక్షులు లక్ష్మణ కుటాల, ప్రధాన కార్యదర్శులు వానిల్లి అంజిబాబు , గుంతా ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి చేయూత

ధర్మవరం టౌన్ : పట్టణంలోని 29వ వార్డు డిఎల్ఆర్ కాలనీకి చెందిన పుల్ల నాగరత్నమ్మ (65) ఆదివారం మృతిచెందింది. మృతురాలికి భర్త తప్ప ఎవ్వరు లేరు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు గతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ నేపథ్యంలో నాగరత్నమ్మకు అంత్యక్రియలు జరపడానికి ఇబ్బంది పడుతున్న విషయాన్ని స్థానికులు తారక్ చేయూత ట్రస్ట్ వారికి తెలియజేశారు. దీంతో వారు దాత సందా రాఘవ సాయంతో ఎనిమిది వేల రూపాయలను మృతురాలి భర్త పుల్ల నాగభూషణకు అందజేశారు.

బాధితులకు ఆర్థికసాయం

ధర్మవరం రూరల్ : పట్టణంలోని 29వ వార్డు డిఎల్ఆర్ కాలనీకి చెందిన పుల్ల నాగరత్నమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షులు బండి వెంకటేష్ ఆధ్వర్యంలో సభ్యులు మృతురాలి కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. మృతదేహానికి నివాళులు అర్పించారు. బాధితులకు బీసీ సంక్షేమ సంఘం తరఫున రూ. 5వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగమన్న, బిటి కొండయ్య, గిరక నాగేంద్ర, లింగమయ్య, సత్యమన్న, బీసీ మల్లన్న, బెల్లం తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

' సాయి సుధా' వార్షికోత్సవం

ప్రజాశక్తి - గోరంట్ల

పట్టణంలో వినాయక గుడి సమీపాన గల సాయి సుధా స్టూడియో 20వ వార్షికోత్సవాన్ని స్టూడియో ప్రొప్రైటర్ హనుమంత రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంత రెడ్డి మాట్లాడుతూ తమ స్టూడియో అత్యాధునిక పరికరాలు, టెక్నాలజీ కలిగి ఉందన్నారు. వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించడమే తమ ధ్యేయమని అన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

లేపాక్షి : మండల పరిధిలోని కంచిసముద్రం గ్రామంలో చేపట్టిన అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణానికి దాతలు విరాళం అందజేశారు. సర్పంచి గంగరత్నమ్మ భర్త 50వేల రూపాయలు,బీసీ సెల్ అధ్యక్షులు రవి 5వేల రూపాయలు, ఒక్క లోడు సిమెంట్, ఇటుకలు విరాళంగా అందించారు.

సచివాలయ ఉద్యోగుల జెఏసి కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి-హిందూపురం

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జెఏసి నూతన కార్యవర్గాన్ని ఆదివారం పట్టణంలోని ఆర్‌పిజిటి రోడ్డులోగల ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జేఏసీ చైర్మన్ గా అంపా శ్రీకాంత్, ప్రెసిడెంట్ గా సిరాల చంద్ర, జనరల్ సెక్రటరీగా జేపీ రెడ్డి, కన్వీనర్ గా శివరాజ్, గౌరవ సలహాదారుడుగా అశ్వర్థప్ప, ఇతర కమిటీ సభ్యులను ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు హిందూపురం పురపాలక సంఘంలో విధులు నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నామన్నారు. ఒక రోజు సెలవు కావాలన్నా కమిషనర్ చాంబర్ ముందు గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి ఉందన్నారు. సచివాలయాల్లో మహిళా ఉద్యోగులకు కనీస సౌకర్యాలు సైతం లేవన్నారు. వీటితో పాటు ప్రొబేషన్ డిక్లేర్ అయ్యి రెండు సంవత్సరాల ఆరు నెలలు అయినప్పటికీ ఇంకా చాలామంది సచివాలయ ఉద్యోగులకు ఈ హెచ్ ఎస్ కార్డులు మంజూరు కాలేదన్నారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలను శాసనసభ సభ్యులు నందమూరి బాలకృష్ణ దృష్టికి తీసుకుపోవాలనే ఉద్దేశంతో ఒక ప్రణాళికతో ముందుకు వెళుతామన్నారు. ఈ సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ శరణ్, ట్రెజరర్ హరినాథ్, వర్కింగ్ ప్రెసిడెంట్లు గణేష్, జీవన్, ప్రవీణ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలు రమేష్, ఆలం, మంజునాథ్, జాయింట్ సెక్రటరీ ధీరజ్, టి బాబా ఫకృద్దీన్, కోఆర్డినేటర్ విజయ్‌తో పాటు అధికసంఖ్యలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కాకతీయ విద్యా నికేతన్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ 15వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు, టూ టౌన్ సీఐ రెడ్డప్ప, ఎంఇఒలు రాజేశ్వరి గోపాల్ నాయక్, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు శెట్టిపి జయ చంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు నైతిక విలువలు పెంపొందించుకోవాలని, అన్ని రంగాలలో రాణించాలని సూచించారు.. విద్యార్థులు ఇష్టపడి చదివినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించగలుగుతారన్నారు. గత సంవత్సరం పదవ తరగతి పరీక్షల్లో టౌన్ ఫస్ట్ వచ్చిన నిత్యశ్రీని వారు ఈసందర్భంగా అభినందించారు. అనంతరం వివిధ అంశాలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు శెట్టిపి రామిరెడ్డి, చిన్న కిష్టమ్మ, కరెస్పాండెంట్ నిర్మలాదేవి, డైరెక్టర్లు సూర్యప్రకాశ్ రెడ్డి, పద్మ, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

పార్టీ ఫిరాయింపు కౌన్సిలర్లకు విప్ జారీ



సమావేశంలో మాట్లాడుతున్న ఉషాశ్రీ చరణ్

ప్రజాశక్తి-హిందూపురం

ఒక పార్టీ సింబల్ పై గెలిచి, పార్టీ ఫిరాయింపు చేసిన కౌన్సిలర్లందరికీ విప్ జారీ చేశామని దీనిని ఎవరు అతిక్రమించినా చర్యలు తీసుకుంటామనివైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల్లో పై చేయి సాధించాలని వైసీపీ కౌన్సిలర్లను ప్రలోభాలకు గురి చేసిందని విమర్శించారు. ప్రలోభాలకు గురి కాని వారిని భయభ్రాంతులకు గురిచేసి తమ పార్టీలోకి చేర్చుకొని తమ బలాన్ని అడ్డదారిన నిరూపించుకోవాలని ప్రయత్నం చేస్తోందన్నారు.. ఇది అప్రజాస్వామ్యమని అన్నారు. ఒక పార్టీ సింబల్ పై గెలిచిన వారిని ప్రలోభాలకు గురిచేసి పార్టీ ఫిరాయింపులకు పాల్పడితే గెలిచిన పార్టీ విప్ జారీ చేస్తే వారి ఓటు హక్కు చెల్లదని కేరళ హైకోర్టు తీర్పు ఇచ్చినట్లు ఆమె వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ తన స్థాయికి తగ్గట్టు వ్యవహరించాలని కోరారు. సోమవారం జరిగే హిందూపురం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక ధర్మానికి అధర్మానికి జరిగే ఎన్నిక అన్నారు. అధికారులు అధికార పార్టీకి అండగా పనిచేయకుండా ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించాలన్నారు. లేనిపక్షంలో స్థానిక అధికారులపై ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేస్తామన్నారు. విప్ జారీ చేసినప్పటికీ కౌన్సిలర్లు అతిక్రమిస్తే వారి పదవిని కోల్పోవాల్సి ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి దీపిక, మున్సిపల్ చైర్మన్ బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలి
వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

'కేంద్రబడ్జెట్ కార్పొరేట్ బడ్జెట్ '

ప్రజాశక్తి - గోరంట్ల

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ వర్గానికి లబ్ధి చేకూరే విధంగా ఉందనిపెనుగొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నరసింహులు విమర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు మాటలు కార్పొరేట్ సంస్థలకు మూటలు చేకూరే విధంగా బడ్జెట్ ఉందన్నారు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ ప్రజలకు ఎలాంటి ప్రయోజనం కల్గించలేదన్నారు. ప్రధాన సమస్యలైన నిరుద్యోగం, అధిక ధరలు, రైతులకు గిట్టుబాటు ధర, రుణమాఫీ, ఉపాధి హామీ పథకం తదితర ప్రధాన సమస్యలకు ఈ బడ్జెట్లో పరిష్కారం చూపలేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుండి నిధులు రాబట్టడానికి ప్రయత్నం చేయాలని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు.

ముదిగుబ్బ : కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో సామాన్యులకు ప్రయోజనం చేకూరలేదని సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పేదలకు, రైతులకు బడ్జెట్ ఉపయోగపడలేదన్నారు కేవలం ధనికులకు, ఆర్థికంగా అభివృద్ధి చెందిన కార్పొరేట్ వ్యక్తులకు ఉపయోగపడేలా ఉందన్నారు.

సిపిఎం రాష్ట్ర మహాసభలకు తరలిన నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సిపిఎం రాష్ట్ర మహాసభలకు పుట్టపర్తి సిపిఎం సిఐటియు నాయకులు తరలి వెళ్లారు. ఆదివారం ఇక్కడి నుంచి రైలులో బయలుదేరి వెళ్లారు. నెల్లూరులో సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మండల సిఐటియు, సిపిఎం నాయకులు పైపల్లి గంగాధర్, పెడపల్లి బాబా మాట్లాడుతూ సోమవారం నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో విఆర్ కళాశాల మైదానంలో భారీగా బహిరంగ సభ జరుగుతుందన్నారు. మహాసభలకు బయలుదేరిన వారిలో ఆ పార్టీ నాయకులు, సిఐటియు నాయకులు, రమేష్, సుధాకర్, రఘు, నారప్ప, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

ముదిగుబ్బ :నెల్లూరులో జరుగుతున్న సిపిఎం రాష్ట్ర మహాసభల్లో పాల్గొనడానికి మండలంలోని సిపిఎం నాయకులు తరలివెళ్లారు. మండలంలోని సిపిఎం నాయకులు రైలు మార్గాన బయలుదేరి వెళ్లారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆటో పెద్దన్న, వెంకటేష్, మునాఫ్, వెంగముని, శ్రీరాములు, సుధాకర్, పోతులయ్య, వెంకటనారాయణ, అవాజ్ కమిటీ, నాయకులు బాబ్జాన్ ,నౌషాద్, భాషా తదితరులున్నారు.

ఘనంగా 'ఉపాధి' వార్షికోత్సవం

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం విభాగం సిబ్బంది ఆధ్వర్యంలో 20వ ఉపాధి హామీ పథకం వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఎపిఒ అనిల్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ ఉపాధి పథకాన్ని 2006 ఫిబ్రవరి 2వ తేదీన నార్పల మండలం బండ్లపల్లి గ్రామంలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారన్నారు. ఆనాటి కూలీ రేటు 80 రూపాయల నుండి నేడు 300 రూపాయల వరకు చేరిందని చెప్పారు. పథకం అమలులో కూడా సాంకేతికను వినియోగించడం ద్వారా సత్ఫలితాలను సాధించడమే కాకుండా పారదర్శకత ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో టిఎలు చంద్రకళ, భారతి, ఎఫ్ఎలు జయకృష్ణ, సదాశివ, రామ్మోహన్, చంద్రశేఖర్, విశ్వనాథ్, అశోక్ కుమార్, చంద్రశేఖర్, పురుషోత్తం, శ్రీనివాసులు, చౌదరి, సివోలు లక్ష్మి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఫీజు పోరు'ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం ఈ నెల 5న నిర్వహించ తలపెట్టిన ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషాశ్రీ చరణ్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని వైసిపి కార్యలయంలో నియోజక వర్గ ఇన్‌చార్జ్ దీపికా, వేణు రెడ్డిలతో కలిసి వైసిపి జిల్లా అద్యక్షురాలు ఉషాశ్రీ చరణ్ ఫీజు పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యలయాల ముందు నిరసన కార్యక్రమాలు చేపట్టి, జిల్లా కలెక్టర్ కు వినతిని ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొనివిజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మేన్ జబివుల్లా, కౌన్సిలర్లు మద్దన జయప్ప, మల్లికార్జున, షాజియా, పట్టణ, రూరల్ కన్వీనర్లు మన్సూర్, రాము, వైసిపి విద్యార్థి విభాగం నాయకులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రయోగ పరీక్షల గోడ పత్రికలు విడుదల

ప్రజాశక్తి-హిందూపురం

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో యురేకా ఎక్స్‌పో పేరిట నిర్వహించే ప్రయోగ పరీక్షలకు సంబంధించిన గోడపత్రికలను జన విజ్ఞాన వేదిక ప్రతినిధి డాక్టర్ ఈటి రామ్మూర్తి ఆదివారం విడుదల చేశారు. పట్టణంలోని ఎన్‌జిఒ హోంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్ ప్రయోగాల పట్ల అవగాహన పెంపొందించాలన్న ఉద్దేశంతో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ ప్రయోగ పోటీలను నిర్వహించడం జరుగుతోందన్నారు.ఉత్తమ ప్రయోగాలను జిల్లా, రాష్ట్రస్థాయిలకు ఎంపిక చేసి బహుమతులు అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. పాల్గొన్న వారందరికీ పోటీదారుల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు రామకృష్ణ, ఉగ్రప్ప, అబ్దుల్ హక్, ఓబులేసు, రవీంద్రారెడ్డి, శ్రీనివాసులు, వీరభద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

గౌనిపల్లిలో చోరీ

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

మండలంలోని గౌనిపల్లిలో ఆదివారం పట్టపగలే చోరీ జరిగింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా నివాసమున్న సోమశేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఎర్రదొడ్డికి దైవదర్శనం నిమిత్తం ఆదివారం వెళ్లారు. ఇది అదునుగా భావించిన దుండగులు ఇంటి తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించి రూ 2.50 లక్షలు నగదు దోచుకెళ్ళినట్లు బాధితుడు తెలిపారు. తాము ఇంటికి వచ్చి చూశాక చోరీజరిగినట్లు తెలిసిందన్నారు. చోరీ జరిగిన విషయాన్ని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

పింఛన్ల పంపిణీలో గొడవ

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని కట్టారుపల్లి పంచాయతీలోని దళితవాడలో నిర్వహించిన పింఛన్ల పంపిణీలో లబ్ధిదారుల మధ్య గొడవ జరిగింది. దీంతో కాలనీలో ఉద్రిక్తవాతావరణం చోటు చేసుకుంది. పింఛన్ల పంపిణీలో అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. పింఛన్లను ఇంటింటికి వెళ్లి పంపిణి చేసి ఉంటే ఇలా జరిగేది కాదని అంటున్నారు. పింఛన్ల పంపిణీలో భాగంగా ఆదివారం గ్రామానికి వచ్చిన అధికారులు ఒక చెట్టు కింద కూర్చొని పింఛన్ల పంపిణీ చేపట్టారని చెప్పారు. దీంతో పింఛన్ల పుస్తకాలు ఒక చోట పెట్టిన సమయంలో కొందరు తారుమారు చేయడంతో గొడవ జరిగిందని గ్రామస్తులు తెలిపారు. ఈ గొడవ కాస్తా ఘర్షణకు దారితీయడంతో పలువురు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. దీంతో రూరల్ సీఐ నాగేంద్ర ఆధ్వర్యంలో తలుపుల ఎస్ఐ నరసింహుడు, నల్లచెరువు ఎస్ఐ మక్బుల్ భాష, నంబర్ పూల కుంట ఎస్ఐ వలిబాషా, జమేదార్ శ్రీనివాసులు సిబ్బందితో ఆదివారం గ్రామానికి చేరుకొని ఇరువర్గాలకు సర్ది చెప్పడంతో సద్దుమణిగిందని చెప్పారు.

ఇసుక తరలింపు అడ్డగింత

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని నారనాగేపల్లిలో సమీపంలోని పెన్నా నది నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గ్రామస్తులు అడ్డుకుని వెనక్కుపంపించారు. ఆదివారంకొంతమంది ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తుండగా నారా నాగే పల్లి గ్రామానికి చెందిన వారు బ్రిడ్జిపై చేరుకొని ట్రాక్టర్లను అడ్డుకున్నారు. పోలీసులకు సమాచారం అందించారు. గ్రామానికి తాగు, సాగునీరు పెన్నా నుంచి తీసుకుంటున్నామనిగ్రామానికి చుట్టు దాదాపు 7, 8 కిలోమీటర్లు ఎక్కడా కూడా తాగునీరు లేక అవస్థలు పడుతున్నామని చెప్పారు. దీంతో పెన్నా నది నీటిని తాగుతున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో యథేచ్ఛగా ఇసుక తరలిస్తే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పెన్నా నదిలో వెళ్లకుండా జెసిబి లతో గుంతలు తీసి ఉంచితే కొంతమంది గరుగు మట్టితో రోడ్డు ఏర్పాటు చేసుకుని ఇసుక తరలిస్తున్నారని దీంతో వారిని అడ్డగించి ట్రాక్టర్లను వెనక్కి పంపించామని చెప్పారు.

బడ్జెట్‌లో మైనార్టీలకు అన్యాయం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

కేంద్రం బడ్జెట్లో మైనారిటీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఖలందర్ విమర్శించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మైనారిటీల సంక్షేమం, విద్యాభివృద్ధి, మదర్సాల అభివృద్ధి వంటి విషయాలపై కేంద్ర ప్రభుత్వం చిన్న చూపు చూసిందన్నారు. మైనారిటీల కోసం కేవలం రూ.3350 కోట్లు మాత్రమే ప్రకటించించిందని , ఇది గత బడ్జెట్ తో పోలిస్తే కేవలం రూ.168 కోట్లు మాత్రమే పెరిగిందని అన్నారు. పూర్తి బడ్జెట్లో మైనారిటీలకు కేటాయించింది కేవలం 66 శాతం మాత్రమే అన్నారు. మొత్తంగా ఈ బడ్జెట్ లో మైనారిటీలకు సంక్షేమ నిధుల కేటాయింపు విషయంలో అన్యాయం జరిగిందన్నారు.

మిత్రుని కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి - బత్తలపల్లి

తమతో పాటు విద్యను అభ్యసించిన స్నేహితుడు అనారోగ్యంతో మృతి చెందడంతో స్నేహితులు ఆ కుటుంబానికి ఆపన్న హస్తం అందించారు. బత్తలపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో 1999 ,2000 సంవత్సరంలో తమతో పాటు విద్యను అభ్యసించిన ఉమా మహేష్ పది రోజుల కిందట గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మృతుని స్నేహితులు చిరంజీవి, వెంకటరమణ, రంగ నాయుడు, రవికుమార్, రాగే నారాయణస్వామి, నారాయణస్వామి, చికెన్ సెంటర్ దాదావాలి, నాగేష్, బోయపాటి రాము తమ వంతు సహాయంగా రూ. 20వేలను ఉమా మహేష్ భార్య రాణికి అందజేశారు.

పిఆర్ 4వ తరగతి ఉద్యోగుల సంఘం ఏర్పాటు

ప్రజాశక్తి - మడకశిర

పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ పిఆర్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నికలు జిల్లా అధ్యక్షులు యన్.తిప్పేస్వామి ఆధ్వర్యంలో జరిగాయి. సంఘం అధ్యక్షుడుగా యస్.హనుమంతరాయప్ప, కార్యదర్శిగా జి.దేవనందకుమార్, అసోసియేట్ అధ్యక్షులుగా యన్.ద్రాక్షాయని,ఉపాధ్యక్షులుగా యం. సిద్దప్ప, సంయుక్త కార్యదర్శిగా హెచ్.చంద్రకళను ఎన్నుకున్నారు. అదే విధంగా కోశాధికారిగా కె.చేతన, కో ఆప్షన్ సభ్యులుగా కె.రాధిక, ఈసీ మెంబర్లుగా జి.లింగరాజు, పి.తిమ్మక్క, బి. తిప్పేస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను మాజీ సర్పంచ్ గుండుమల చంద్రప్ప, పి ఆర్ ఉద్యోగులు శాలువాలతో అభినందించారు.ఈ కార్యక్రమంలో పిఆర్ నాల్గవ తరగతి ఉద్యోగులు పాల్గొన్నారు.

నిరుపేద క్రీడాకారులకు ప్రాధాన్యత కల్పించండి

ప్రజాశక్తి - తాడిమర్రి

నిరుపేద క్రీడాకారులకు ప్రాధాన్యత కల్పించాలని శాప్ చైర్మన్ రవి నాయుడుకు బీసీ సెల్ అధ్యక్షులు ముసుగు శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. బాల్ బ్యాడ్మింటన్ లో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన మండలంలోని ఆత్మకూరు గ్రామానికి చెందిన క్రీడాకారుని పావనితో కలసి శాప్‌ఛైర్మన్ రవినాయుడిని కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈసందర్భంగా ముసుగు శ్రీనివాసులు మాట్లాడుతూ మండల పావనిక్రీడలలో మంచి ప్రతిభ కనపర్చుతున్నా ఆర్థిక సమస్యల వల్ల ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. ఇలాంటి నిరుపేద క్రీడాకారులను గుర్తించి వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని కోరారు.

స్పోర్ట్స్ రిజర్వేషన్ పెంపుపై హర్షం

ప్రజాశక్తి - బత్తలపల్లి

ప్రభుత్వ విద్యా ఉద్యోగ నియామకాలలో స్పోర్ట్స్ రిజర్వేషన్ శాతాన్ని పెంపుదల చేయడం పట్ల ఉమ్మడి అనంతపురం జిల్లా ఏపీ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు నాయకులు శాప్ చైర్మన్ రవినాయుడును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ఉమ్మడి అనంతరం జిల్లా పర్యటనకు విచ్చేసిన రవినాయుడును అనంతపురంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఏపీ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ సభ్యులు సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, అనంతపురం జిల్లా అధ్యక్షుడు కేశమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు,రాష్ట్ర నాయకులు ప్రభాకర్, ఆంజనేయులు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ సభ్యులతోపాటు హాకీ సీనియర్ క్రీడాకారుడు పిడి రాగేష్ బాబు, శ్రీనివాసరెడ్డి, శకుంతల, అనంతపురం జిల్లా ఎస్జిఫ్ సుగుణమ్మ, సీనియర్స్ హాకీ క్రీడాకారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సుపరిపాలన : టిడిపి

పెనుకొండ : ఏపీలో సుపరిపరిపాలన విధానం ప్రపంచానికే రోల్ మోడల్‌గా నిలిచిందని టిడిపి పట్టణ అధ్యక్షులు శ్రీరాములు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వాట్సప్ గవర్నెన్స్ ప్రారంభించిన నేపథ్యంలో ఆయన సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ లకు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. గతంలో ప్రజల వద్దకే పాలన తెచ్చామని గొప్పలు చెప్పుకున్న వైసిపి నాయకులు చిన్న సమస్యను కూడా పరిష్కరించలేక పోయారన్నారన్నారు. ప్రజల సమస్యల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు తప్ప ప్రజలకు జరిగిన ప్రయోజనం లేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా వాట్సప్ గవర్నెన్స్ తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సేవల్ని 9552300009 వాట్సాప్ నెంబర్ ద్వారా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.